క్లుప్తంగా

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మండలంలోని ధర్మాపూర్ శివారులో ఈనెల 24వ తేదీ మిషన్ భగీరథ పథకం మెయిన్ పైపులైన్‌కు పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో రాంరెడ్డిగూడెం నుంచి మహబూబ్‌నగర్ పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు గురువారం సాయంత్రం మరమ్మతు చేపట్టారు. యథావిధిగా శుక్రవారం నుంచి రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా కొనసాగుతుందని ఏఈ పృథ్వీ తెలిపారు.

ఇళ్లలో పాతవస్తువులను దానం చేయండి



భూత్పూర్: మున్సిపాలిటీలోని ప్రజలు తమ ఇళ్లలో నిరుపయోగం, పాత ఏ వస్తువునైనా ఇవ్వాలని చైర్మన్ బస్వరాజ్ గౌడ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్యూస్, రీ యూస్, రీ సైక్లింగ్ (ఆర్ఆర్ఆర్)పేరుతో వార్డులోని ప్రజలు తమ ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న టీవీలు, దుస్తులు, ప్లాస్టిక్ బకెట్లు, ఏవైనా గృహోపకరణాలు మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని చైర్మన్ గౌడ్ అన్నారు. అవసరమున్న నిరుపేదలను గుర్తించి వారికి తమ సిబ్బంది అందిస్తారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నజీబ్, నారాయణ గౌడ్, నర్సింహులు, రాములు ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష



మిడ్జిల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అధికారులతో డీపీఓ వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీపీఓకు సన్మానం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై గురువారం మండల కేంద్రానికి వచ్చిన వచ్చిన డీపీఓను మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానిచ్చారు. కార్యక్రమంలో ఇమ్రాన్, వెంకటేష్, మధు, సుదర్శన్ ,జ్యోతి, శివాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



మిడ్జిల్: సీఎం కప్ క్రీడా పోటీల్లో జిల్లా స్థాయిలో లాంగ్‌జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన మండల కేంద్రానికి చెందిన అఖిల, 100 మీటర్ల రన్నింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మల్లాపూర్ చెందిన పౌర్ణమి, 100 మీటర్ల రన్నింగ్‌లో రజత పతకం సాధించిన దోనూర్‌కు చెందిన రమాకాంత్‌రెడ్డిని గురువారం ఎంపీపీ సుదర్శన్, ఎంపీడీఓ సాయిలక్ష్మి సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో మండలానికి గుర్తింపు తేవాలని సూచించారు.

ఓఆర్ఎస్, జింక్ మాత్రల పంపిణీ



పాలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి జూన్ 8వరకు ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పీహెచ్‌సీ, సబ్ సెంటర్, అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలో ఉన్న చిన్నారులకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మొత్తం 14రోజుల పాటు కొనసాగనుంది. దీంతో పాటు చిన్నారులు డయేరియా రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అంశంపై ఆశాకార్యకర్తలు అవగాహన కల్పించారు. లీటర్ నీటిలో ఓఆర్ఎస్ కలిపి పిల్లలకు తాగించాలని, దీంతో పాటు కొబ్బరి నీళ్లు, నిమ్మరసం తాగించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్ తెలిపారు.

ఆస్తి పన్ను వసూలుపై దృష్టి

- ప్రజలకు డిమాండ్ నోటీసుల జారీ
- పింఛన్‌దారులు కేవైసీ చేయించుకోండి
- మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఆదేశించారు. గురువారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 2023–24కు గాను ఆస్తి పన్నుకు సంబంధించి అసెస్‌మెంట్‌దారులకు డిమాండ్ నోటీసులు వెంటనే జారీ చేయాలన్నారు. పట్టణంలో ఇప్పటికే 19వేల పైచిలుకు ఆసరా పింఛన్లు అందిస్తున్నామన్నారు. వీరిలో 343 మంది ఆయా బ్యాంకు ఖాతాల్లో ఆధార్ లింకేజీతో పాటు కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఏఎంసీ వెంకటేశ్వరరావు, రెవెన్యూ విభాగం సీనియర్ అసిస్టెంట్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

జూన్ 5 నుంచి గొర్రెల పంపిణీ

భూత్పూర్: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్నాసాగర్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి గొర్రెల పెంపకందారుల సహకారం సంఘం అధ్యక్షులు, పశు సంవర్ధక శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు తమ వాటా సొమ్మును సకాలంలో చెల్లించాలన్నారు. గతంలో మాదిరి ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా, గొర్రెల కొనుగోలు, పంపిణీ సమయంలో అధికారులు లబ్ధిదారులు సమన్వయం చేసుకోవాలన్నారు. రెండవ విడతలో లబ్ధిదారుడు చనిపోయి ఉంటే కుటుంబ సభ్యులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి భారీగా పెరిగిందని, దేశంలోనే రాష్ట్రం 5వ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే చెప్పారు.

బాలిక కడుపులో కణతి తొలగింపు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని సుశ్రుత ప్రజా వైద్య శాలలో అరుదైన చికిత్స నిర్వహించారు. భూత్పూర్ మండలం కర్వేనాకు చెందిన బాలిక శృతి కడుపు నొప్పితో ఆస్పత్రికి రావడంతో అన్ని రకాల పరీక్షలు, స్కానింగ్ చేసిన తర్వాత కడుపులో దాదాపు నాలుగు కేజీల కణతి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆ తర్వాత ఎక్స్‌ట్రా హైపటిక్ పోర్టల్ హైపర్ టెన్షన్ విత్ హైపర్ స్ప్లీ అనే అరుదైన జబ్బుగా వైద్యులు నిర్ధారించారు. దీంతో పాప రక్తంలో రక్తకణాలు పూర్తిగా తగ్గిపోయి అన్న వాహికలో(ఈసో పాగస్)లో రక్తనాళాలు ఉబ్బిపోయాయి. ఈమెకు డాక్టర్ సురేష్, శ్రీనివాసరావు బృందం ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేసి కణతి తొలగించారు. ప్రస్తుతం అమ్మాయి పూర్తి ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: కడుపునొప్పి భరించలేక ఓ మహిళ పురుగుల మందుతాగి, చికిత్స పొందుతూ మృతి చెందింది. గురువారం రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామచంద్రాపూర్ చెందిన బుచ్చమ్మ(54) ఈనెల 24న ఉదయం 9గంటలకు ఇంటి సమీపంలో పురుగుల మందుతాగింది. చికిత్స కోసం కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు కొంతకాలం నుంచి మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో పాటు తీవ్రమైన కడుపు నొప్పి వల్ల పురుగుల మందుతాగిందని మృతురాలి భర్త సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధ్యాత్మిక భావాలతో ఎంతో ప్రశాంతత



జూలపల్లిలో బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

మహమ్మదాబాద్/గండేడ్: ఆధ్యాత్మిక భావాలతో ఎంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. గ్రామదేవతల ప్రతిష్ట భాగంగా గురువారం మహమ్మదాబాద్ మండలంలోని జూలపల్లి, గండేడ్ మండలంలోని జక్లపల్లిలో బొడ్రాయి, నాగదేవత ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఎంతో ఆధ్యాత్మికంగా ఉంటున్న వారు ఆరోగ్యంగా జీవిత గడుపుతున్నారన్నారు. జూలపల్లిలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి రూ.51వేలను విరాళంగా అందించారు. జక్లపల్లిలో ఎమ్మెల్యే రూ.31వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, ఈశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాధలు వింటూ.. భరోసా ఇస్తూ..

జడ్చర్ల: సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర గురువారం 70వ రోజుకు చేరుకుంది. బండమీదిపల్లి నుంచి ప్రారంభమైన యాత్ర కావేరమ్మపేట మీదుగా పట్టణంలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు చేరుకుంది. పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుంటూ.. బాధలు వింటూ.. ముందుకు సాగారు. బండమీదిపల్లిలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న నిరుద్యోగి కారుకొండ సిద్ధు తన గోడును వెళ్లబోసుకున్నాడు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశలు పెంచుకున్న నేపథ్యంలో ప్రభుత్వం నోటిఫికేషన్లు వేయడం లేదని వాపోయాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు వేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలలో నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. అదే గ్రామానికి చెందిన రైతులు చెన్నయ్య, రాములు, సాయన్న, భీమయ్య, నాగయ్య పాదయాత్రలో తమ సమస్యలను ఏకరువుపెట్టారు. బండమీదిపల్లి శివారులో దాదాపు 83 ఎకరాల భూమిని తరతరాలుగా సాగు చేసుకుంటున్నామని, ఇటీవల ధరణిలో తమ భూమిని మరో వ్యక్తికి బదలాయించి తమనుతరిమి వేశారని కన్నీరుమున్నీరయ్యారు. ధరణిలో మరో వ్యక్తికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని వారు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ధరణిని తీసుకువచ్చి పేదల బతుకులను తారుమారు చేశారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ ఆక్రమణలు, అధికారులు, పాలకుల పనితీరును పట్టణానికి చెందిన సామాజికవేత్త అనిల్‌కుమార్ మల్లు బట్టి విక్రమార్కను కలిసి వివరించి పలు పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, టీపీసీసీ సెక్రటరీ అనిరుద్‌రెడ్డి పాల్గొన్నారు.



జడ్చర్లకు చేరుకున్న పాదయాత్ర

సభకు భారీగా తరలిన శ్రేణులు

మిడ్జిల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జడ్చర్లలో నిర్వహించిన సభకు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి రెండు, మూడు బస్సులలో ప్రజలను సభకు తరలించారు. వెళ్లిన వారిలో మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, సంపత్, గౌస్, నర్సింహులు, సాయిలు, రాజారెడ్డి, విజయ్ తదితరులు ఉన్నారు.

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జడ్చర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. గురువారం మండల నాయకులు తులసీరాంనాయక్, అంజనేయులు, మీనాక్షి ఆధ్వర్యంలో 3వేల మందికిపైగా తరలివెళ్లినట్లు వారు తెలిపారు.



మిడ్జిల్ నుంచి సభకు వెళ్తున్న నాయకులు

దొంగతనానికి యత్నించిన మహిళల అరెస్టు

మహబూబ్‌నగర్ క్రైం: కూలీ పనులు చేస్తే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుని ఇద్దరూ మహిళలు మరో మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేసే క్రమంలో టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఝూన్సీనగర్‌కు చెందిన యాదమ్మ, కిద్వాయిపేట్‌కు చెందిన విజయలక్ష్మి కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో డబ్బులు సరిపోవడం లేదని భావించి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. మండలంలోని అడవి వెంకటాపూర్‌కు చెందిన పోశమ్మ ఇంటింటికీ తిరిగి కూరగాయాలు విక్రయిస్తుంటుంది. ఈనెల 23న పోశమ్మ కూరగాయాలు విక్రయించడానికి పట్టణానికి రావడంతో ఆమెతో కూరగాయలు కొనుగోలు చేస్తున్నట్లు మాట్లాడి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును చోరీ చేయాలని ప్రయత్నించి విఫలం అయ్యారు. మళ్లీ ఈనెల 24న కొత్త గంజ్ లక్ష్మీనర్సింహ ఆలయం సమీపంలో ఆమె కూరగాయాలు విక్రయిస్తుంటే ఇద్దరూ మహిళలు పోశమ్మ దగ్గరికి వెళ్లి కూరగాయాలు కావాలి ఇంటికి రావాలని తెలిపారు. మార్గమధ్యలో బోయపల్లిగేట్ సమీపంలో కంట్లో కారంపొడి చల్లి బంగారు పుస్తెలతాడు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తుంటే పోశమ్మ వారిని గట్టిగా పట్టుకుంది. స్థానికులు వారిని పట్టుకోవడానికి ప్రయత్నం చేయగా బంగారు పుస్తెలతాడు అక్కడే వదిలేసి పరారయ్యారు. గురువారం యాదమ్మ, విజయలక్ష్మిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గ్రామదేవత విగ్రహాల ఊరేగింపు



నవాబుపేట: మండలంలోని దేపల్లిలో గురువారం బొడ్రాయి, గ్రామ దేవతల విగ్రహాలు ఊరేగించారు. గురువారం నుంచి శనివారం వరకు ప్రతిష్ట ఉత్సవాలు, ఆదివారం గ్రామదేవతలకు బోనాల కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని 23వ వార్డులో పారిశుద్ధ్య పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి పరిశీలించారు. ఇళ్ల మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డు ప్రజలకు సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్, రమేష్, రామ్మోహన్, రవీందర్ ఉన్నారు.

దివ్యాంగుల రిజర్వేషన్లను 10 శాతానికి పెంచాలి

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణలో దివ్యాంగుల రిజర్వేషన్లను 4 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఉదయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులు రోస్టర్ పాయింట్ టాప్ 10లో రావాలని, ప్రతి నోటిఫికేషన్‌లో వీహెచ్ లేకపోతే హెచ్‌హెచ్, లేకపోతే ఓహెచ్ దివ్యాంగులకు అదే నోటిఫికేషన్‌లో అవకాశం ఇవ్వాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, యాదమ్మ, రాజు, నాగరాజు, కృష్ణయ్య, అంజయ్య, రాధిక తదితరులు ఉన్నారు.

> ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల మనోగతం..

డాక్టర్ కావాలన్న లక్ష్యంతో..



పరీక్షలకు సిద్ధమయ్యే క్రమంలో ఖచ్చితత్వంతో చదవడం ఎంత ముఖ్యమో సమయ పాలనతో చదవడం కూడా అంతే ముఖ్యం. చదివే క్రమంలో ప్రతి రోజు ప్రత్యేక టైం టేబుల్ ప్రకారం చదివా. మంచి మార్కులు సాధించా. డాక్టర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నా. కళాశాల అధ్యాపకులు సహకరించారు.

– రిజ్వాన్, అగ్రికల్చర్, 268 ర్యాంక్, ప్రతిభ కళాశాల

ప్రణాళికబద్ధంగా చదివి..



పరీక్షలో మంచి మార్కులు సాధించేందుకు సమయం వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకున్నా. ముఖ్యంగా ఫోన్, టీవీ జోలికి పోకుండా ఎక్కువ సమయం పుస్తకాలతో గడిపా. ఇంటి వద్ద నుంచి సబ్జెక్టులో సందేహాలు వస్తే ఫోన్ చేసిన వెంటనే స్పందించి అధ్యాపకులు నివృత్తి చేశారు. దీంతో ప్రిపరేషన్ మరింత సులువుగా సాగింది. ఇంజినీరింగ్ చేరాలన్న లక్ష్యంగా చదువుతున్నా.

– ఇబ్రహీం, ఇంజినీరింగ్, 377వ ర్యాంకు, ప్రతిభ కళాశాల

అధ్యాపకుల సహకారం



పరీక్షలకు సిద్ధమయ్యే క్రమంలో చాలా సమయం కేటాయించి సిలబస్ అనుకున్న సమయంలో పూర్తి చేశారు. తరగతి గదిలో, ఇంటి వద్ద సబ్జెక్టులో సందేహాలు వస్తే అధ్యాపకులు వెంటనే తీర్చారు. మంచి మార్కులు సాధించడంలో అధ్యాపకులు ఎంతో సహకరించారు. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో చదువుతున్న, తల్లిదండ్రుల సహకారంతో ఎంతో ఉంది.

– సీ.మౌర్య, అగ్రికల్చర్, 349వ ర్యాంకు, రిషి జూనియర్ కళాశాల

లక్ష్య సాధనకు శ్రమించా..



భవిష్యత్‌లో డాక్టర్ కావాలన్న లక్ష్యంతో కష్టపడ్డా. ఎక్కువగా కళాశాలలో ప్రతి రోజు ప్రాక్టీస్ పేపర్లు, టెస్టులు రాయడం వల్ల పోటీ పరీక్ష సులువుగా రాయగలిగాను. ఇందుకు కళాశాల యాజమాన్యం, మా కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారు. నీట్‌లో కూడా ర్యాంకు సాధించి మంచి కళాశాలలో సీటు సాధిస్తా.

– క్రితిక్‌తేజాస్, 382, అగ్రికల్చర్, రిషి జూనియర్ కళాశాల

చాలా సమయం కేటాయించా



తరగతి గదిలో ప్రతి రోజు సాధారణ తరగతులతో పాటు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు కూడా హాజరవుతూ అభ్యసనా సామర్థ్యాలను మరింత మెరుగు పర్చుకునేందుకు చాలా సమయం కేటాయించాం. చదివే క్రమంలో సులువుగా అర్థమయ్యే విధంగా బోధించడంతో పాటు, అధ్యాపకులు సందేహాలను వెంటనే నివృత్తి చేసేవారు. యాజమాన్యం, తల్లిదండ్రులు ఎంతో సహకరించారు.

– వరుణ్‌కుమార్, అగ్రికల్చర్ 407ర్యాంకు, వాగ్దేవీ కళాశాల

ఎక్కడి గురుకులాలు అక్కడే!

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- నవాబుపేట గురుకుల జడ్చర్లలో కొనసాగుతున్న వైనం
- మండల కేంద్రంలోకి మార్చాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు

నవాబుపేట: ఏ మండలానికి చెందిన గురుకులాలు అక్కడే కొనసాగించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో జడ్చర్లలో కొనసాగుతున్న నవాబుపేట గురుకుల పాఠశాల విషయం వెలుగులోకి వచ్చింది. రెండేళ్ల క్రితం మండలానికి గురుకుల పాఠశాల మంజూరైంది. దీన్ని ఏర్పాటు చేయటంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేయటంతో పాటు వసతి సౌకర్యం లేదన్న కారణం చూపి, దాన్ని జడ్చర్ల నియోజకవర్గం కేంద్రంలోనే ఏర్పాటు చేశారు. అక్కడ గురుకుల పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు మాత్రం ఏటా దాదాపుగా 35 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి మండల కేంద్రంలోనే రాయడానికి వస్తున్నారు. ఇలా కేవలం విద్యార్థుల పరీక్షలకు కాకుండా ఇతర వాటి విషయంలో సైతం చాలా సాంకేతిక ఇబ్బందులు వచ్చిపడ్డాయి. గతేడాది టెట్ పరీక్షల్లో సైతం నవాబుపేట గురుకుల పాఠశాల చిరునామా రాగా చాలా మంది అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడి చిరునామా తెలుసుకున్నారు. పాఠశాలలో ఉండే బోధనేతర సిబ్బంది తదితర విషయాల్లో సైతం మండలానికి కొంత నష్టం కలుగుతుంది. దీంతో పాటు విద్యార్థులకు చేరికలు తదితర అంశాలు చాలా ముఖ్యమైనవి. ఇలాంటి సందర్భంలో గురుకుల పాఠశాల మండలంలో కాకుండా ఇతర ప్రాంతంలో ఉండటంతో ఇబ్బందులు అనేకం. ఈ పాఠశాలను ఎలాగైన మంజూరైన మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఏడాది ఏదో ఒక సాకుతో మాట దాట వేస్తున్నారు. తాజాగా ఆదేశాలు అందటంతో స్థలం కోసం అధికారులు అన్వేషణ మొదలు పెట్టకతప్పటం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 375 గురుకుల పాఠశాలలు వేరే చోటనే కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించి వాటిని మంజూరైన ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మండలానికి గురుకుల పాఠశాల వస్తుందన్న సంతోషంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.



జడ్చర్లలో కొనసాగుతున్న నవాబుపేట గురుకుల పాఠశాల

డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పరిశీలన

నారాయణపేట రూరల్: పట్టణంలోని సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం న్యాక్ బృందం పరిశీలించి. మూడు రోజుల తనిఖీల్లో భాగంగా చైర్మన్ ప్రొఫెసర్ నీల్మణిప్రసాద్‌వర్మ నేతృత్వంలో ప్రొఫెసర్ లలిత్‌కుమార్, డాక్టర్ ఎడ్విన్ జ్ఞాన్‌దాస్, సీసీఈ జీఎంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీ.యాదగిరి నారాయణపేటకు చేరుకోగా ప్రిన్సిపాల్ రంగారెడ్డి, అధ్యాపక బృందం వారికి స్వాగతం పలికారు. అనంతరం కళాశాల ఆవరణ, తరగతి గదులు, క్రీడాప్రాంగణం, గ్రంథాలయం, ప్రయోగశాల, హరితక్లబ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర వాటిని పరిశీలించారు. అడ్మిషన్ల ప్రక్రియ, పూర్వ విద్యార్థుల ఉద్యోగ, ఉపాధి కల్పనపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పోషకులతో వేర్వేరుగా సమావేశమై వారి నుంచి పలు అంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కళాశాలలో సౌకర్యాలు, బోధన పరికరాలు, భవన నిర్మాణం, అధ్యాపకుల అర్హతలు పరిశీలించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేశ రక్షణ, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ తదితర వాటిపై చేసిన నృత్యాలను మెచ్చుకున్నారు. ప్రజాప్రతినిధుల సహకారం ఉంటే విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందుతుందని న్యాక్ బృందం సభ్యులు పేర్కొంటూ.. జిల్లాలో విద్యాభివృద్ధితో పాటు కళాశాలకు నిధులు కేటాయించి ప్రత్యేక శ్రద్ధ చూయించడంపై ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ యాదగిరి, న్యాక్ కో ఆర్డినేటర్ నారాయణగౌడ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మరింత ఉత్సాహంతో పనిచేయాలి



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

భూత్పూర్: గ్రామాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కార్యదర్శులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్నాసాగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పంచాయతీల్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు తమను రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రభుత్వం, సీఎం కేసీఆర్ గుర్తించిన సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించి, అనంతరం స్వీట్లు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యదర్శులను రెగ్యులర్ చేసినందుకు వారి కుటుంబాలు సీఎం కేసీఆర్‌కు ఎల్లప్పుడు రుణపడి ఉంటారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

నవాబుపేట: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం కొనుగోలు కేంద్రాల విషయంలో మార్కెటింగ్ అధికారులతో ఆయన మాట్లాడారు. ధాన్యంలో దుమ్ము తదితర వాటిని కేంద్రం వద్ద తూర్పార పట్టాలని వివరించారు. మట్టి, ఇతరత్ర లేకుండా చూడాలని అప్పుడే ధాన్యానికి మంచి ధర వస్తుదని వివరించారు. కొల్లూర్, చౌడూర్, పోమాల్ కేంద్రాల్లో వీటి విషయంలో చాలా అభ్యంతరాలు వచ్చాయని, రైతులు ధాన్యంలో దుమ్మును తొలగించి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ఆయన సూచించారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

అడ్డాకుల: మండలంలోని విత్తనాల దుకాణాల్లో వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఎస్ఐ మాధవరెడ్డి గురువారం తనిఖీ చేపట్టారు. విత్తనాల స్టాకు వివరాలు, అనుమతి పత్రాలను పరిశీలించారు. విత్తనాలను విక్రయిస్తే తప్పకుండా రశీదులు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు పంట కాలం పూర్తయ్యే వరకు విత్తనాల రశీదులను జాగ్రత్తగా దాచుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాలు విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తనిఖీ చేస్తున్న అధికారులు

ఆఫర్ పేరుతో రూ.48వేల టోకరా

మహబూబ్‌నగర్ క్రైం: ఆఫర్‌లో ఐఫోన్, ఐపాడ్ వచ్చాయని నమ్మించి.. ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఏనుగొండకు చెందిన బాలరాజుకు ఈనెల 20న 923057975289 నంబర్ నుంచి ఆన్‌లైన్ ద్వారా మెసేజ్ లింక్ పంపారు. జామ్ జామ్ ఎలక్ట్రానిక్ నుంచి ఐఫోన్, ఐపాడ్‌లు ఆఫర్‌లో వచ్చాయని చెప్పారు. సైబర్ నేరగాళ్లు అడిగిన విధంగా బాలరాజు ఈనెల 22న 23న దఫల వారీగా మొత్తం రూ.48వేలు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపించాడు. డబ్బులు పంపిన తర్వాత ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.